క్లుప్తంగా

తులసిముని మృతి తీరనిలోటు


తులసిముని

నారాయణవనం : వైఎస్సార్‌సీపీ నేత, నారాయణవనం పంచాయతీ మాజీ ఉప సర్పంచి తులసిముని(90) బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయన మృతికి వైఎస్సార్ సీపీ నాయకులు సంతాపాన్ని వ్యక్తం చేశారు. సంతాపం తెలిపిన వారిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ సారకాయలు, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, నాయకులు గురుస్వామి, కిరణ్, అన్నాదొరై ఉన్నారు.

కాలనీలో చోరీలు అరికట్టాలని ఫిర్యాదు


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న హౌసింగ్ ఏఈ రమణయ్య

శ్రీకాళహస్తి : మండలంలోని జగనన్న కాలనీలో జరిగే చోరీలను అరికట్టాలని హౌసింగ్ ఏఈ రమణయ్య శ్రీకాళహస్తి రూరల్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పార్టీలకతీతంగా నిర్మించిన జగనన్న కాలనీలోని ఇళ్ల కిటికీలు, స్టీలు, దారబంధనాలు చోరీకి గురవుతున్నాయన్నారు. నిత్యం ఈ కాలనీలో చోరీలు జరుగుతున్నాయన్నారు. బుధవారం ఉదయం కాలనీలో ముగ్గురు వ్యక్తులు కిటికీలు పగులగొట్టి గ్రిల్స్‌ను బైక్ మీద తీసుకెళుతుండటంతో కాంట్రాక్టరు గుర్తించి ప్రశ్నించగా దాడికి యత్నించారన్నారు. అయితే సన్నిహితులకు ఆయన సమాచారం అందించడంతో వారి ముగ్గురిలో ఒకరిని పట్టుకుని శ్రీకాళహస్తి రూరల్ పోలీసులకు అప్పగించారని తెలిపారు. ఆతను ఇచ్చిన ఆధారాల మేరకు మరో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన ఇళ్లకు రక్షణ లేకుండా పోతోందని, వెంటనే చోరీలను అరికట్టాలని కోరారు.

హైందవ శంఖారావం జయప్రదం చేయండి

బుచ్చినాయుడుకండ్రిగ : ఈనెల 5వ తేదీన విజయవాడలోని కేసరపల్లి వద్ద జరగనున్న హైందవ శంఖారావంలో హిందువులు భారీ సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు. బుధవారం నీర్పాకోటలోని ఆంజనేయ స్వామి ఆలయంలో వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలతో నిర్వాహకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 4వ తేదీ సాయంత్రం బుచ్చినాయుడుకండ్రిగ నుంచి బస్సు హైందవ శంఖారావం సభకు బయలుదేరుతుందని చెప్పారు. ఆలయాల పరిరక్షణ కోసమే హైందవ శంఖారావం నిర్వహిస్తున్నామన్నారు. హిందువులు తప్పక హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): జీవాగ్రామ్ సెయింట్ లూక్ లూథరన్ చర్చిలో నూతన కమిటీ ప్రమాణ స్వీకారం ఘనంగా జరిగింది. రేణిగుంట మండలం గాజులమండ్యం పంచాయతీ జీవాగ్రామ్ సెయింట్ లూక్ లూథరన్ చర్చిలో బుధవారం స్థానిక పాస్టర్ కె.పి.లూథర్ బాబు కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. పి.సి.సి. అధ్యక్షుడు ఏసురత్నం, కార్యదర్శి నిర్మల చార్లెస్, కోశాధికారి పుష్పాంజలి, సభ్యులను ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కమిటీ కాల పరిమితి మూడేళ్లు ఉంటుంది. కార్యక్రమంలో సంఘం పెద్దలు, సభ్యులు పాల్గొన్నారు.

చెదిరిన సొంతింటి కల

పేదోడికి సొంతింటి కలను నెరవేర్చేందుక అప్పటి వైస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేకంగా పట్టాలు ఇచ్చి ఊళ్లను నిర్మించే మహాయజ్ఞం చేపట్టింది. అందులో భాగంగా దాదాపు వంద ఇళ్లు పూర్తి చేసి పేదల మోములో చిరునవ్వులు చూశారు. ఈ క్రమంలో మిగిలిన ఇళ్లను వేగవంతంగా చేసే క్రమంలో ప్రభుత్వం మారడంతో కూటమి అధికారంలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో ఆరు నెలలు గడిచినా జగనన్న కాలనీల గురించి ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కాలనీల్లో నివాసం ఉంటున్న జనం నరకయాతన పడుతున్నారు.



- జగనన్న కాలనీలో సమస్యల తిష్ట
- ఇబ్బందులు పడుతున్న కాలనీవాసులు
- వసతులు కల్పించని అధికారులు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గత సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి పేదలకు సొంత ఇంటి కల నెరవేర్చాలనే సదుద్దేశంతో రేణిగుంటలో 3000 మందికి పైగా మండలంలోని అడుసుపాలెంలో జగనన్న లేఅవుట్ ఏర్పాటు చేసి పేదలకు ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. అందులో సుమారు 1000 ఇళ్లు వివిధ దశల్లో ఉండగా 100 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. కాలనీలో మౌలిక వసతులు లేక నివాసం ఉంటున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గడిచిన ఆరు నెలల్లో కూటమి ప్రభుత్వం జగనన్న కాలనీలను పట్టించుకోకపోవడంతో సమస్యలతో స్థానిక ప్రజలు సతమతం అవుతున్నారు. మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అధికారులు అటు వైపే వెళ్లకపోవడంతో సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియని అయోమయ పరిస్థితుల్లో జగనన్న కాలనీలో నివాసం ఉంటున్న ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా కాలనీలోని వీధులు గుంతలమయమై చినుకు పడితే అడుగు పెట్టలేని పరిస్థితులు నెలకొన్నాయి. వీధి కాలువలు లేక మురుగు నీరు, వర్షపు నీరు ఖాళీ ప్లాట్లలో చేరి దోమలకు నిలయంగా మారుతున్నాయి. దీంతో దోమలు విపరీతంగా పెరిగి పిలలు డెంగ్యూ, మలేరియా వంటి విష జ్వరాల బారిన పడుతున్నారు.

అంధకారంలో వీధులు

కాలనీలో వీధి దీపాలు పూర్తి స్థాయిలో వెలగకపోవడంతో రాత్రి చిమ్మ చీకటిలో ఉండాల్సి వస్తోంది. మరోవైపు దొంగల బెడద తీవ్రంగా ఉందని రాత్రి సమయాల్లో దొంగలు వీరవిహారం చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. రాత్రి సమయంలో పోలీసులు కాలనీలో గస్తీ నిర్వహిస్తే దొంగల బెడద నుంచి ఉపశమనం ఉంటుందని కాలనీ వాసులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

స్పందనలేని అధికారులు

జగనన్న కాలనీ సమస్యలను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా కాలనీపై అధికారాలు తమ పంచాయతీకి ఇవ్వలేదంటున్నారు. అందువల్ల సదుపాయాలు కల్పించలేకపోతున్నామని ఎల్లమండ్యం పంచాయతీ అధికారులు చెబుతుండడం గమనార్హం.


అధ్వానంగా కాలనీ వీధులు


ఇళ్ల మధ్యలో మురుగు నీరు


మౌలిక వసతులు లేని కాలనీ

కాల్వలు నిర్మించండి



జగనన్న కాలనీలో నివాసం ఉంటున్నాం. రోడ్లు, డ్రైనేజీ కాల్వలు లేక చాలా ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు చొరవ చూపి సమస్యలను పరిష్కరించాలి.

\- గురవయ్య , జగనన్న కాలనీ

చీకటిలో బతుకుతున్నాం



జగనన్న కాలనీలో చిమ్మ చీకటిలో బతుకుతున్నాం. వీధి లైట్లు పూర్తి స్థాయిలో వెలగడం లేదు. పంచాయతీ అధికారులకు అనేకసార్లు చెప్పినా స్పందన లేదు. ఉన్నతాధికారులు మాపై దయ చూపాలి.

-నవమల్లిక , జగనన్న కాలనీ

అధికారుల దృష్టికి తీసుకెళ్లినా..



కాలనీలోని సమస్యలను ఎన్నిసార్లు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదు. మా పంచాయతీకి జగనన్న కాలనీపై పూర్తి అధికారాలు ఇవ్వలేదని ఎల్లమండ్యం పంచాయతీ అధికారులు అంటున్నారు.

-జ్యోతమ్మ, జగనన్న కాలనీ

సమస్యలు పరిష్కరించండి



కాలనీలో రోడ్లు, కాల్వలు , వీధి దీపాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఎమ్మెల్యే అయినా సమస్యలు గుర్తించి పరిష్కరించాలి.

\- సురేష్ జగనన్న కాలనీ

వైఎస్సార్‌సీపీ నేతలకు సత్కారం


ఆర్టీసీ కార్మికులతో కలిసి డైరీలను ఆవిష్కరిస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు


నూకతోటి రాజేష్‌ను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

శ్రీకాళహస్తి : నూతన ఆంగ్ల సంవత్సరాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులను పలువురు ఘనంగా సన్మానించారు. అందులో భాగంగా ఏపీటీఎఫ్ టీచర్ అసోసియేషన్, ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్, శ్రీకాళహస్తి టైలర్స్ అసోసియేషన్, పలువురు ప్రముఖులు బుధవారం ఆయనను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆయన చేత కేక్ కట్ చేయించారు. ఆయనను సత్కరించిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నం వాసునాయుడు, షేక్‌సిరాజ్‌బాషా, మున్నా రాయల్, సురేష్, జయ, శేఖర్, గణేష్, మణి, హరినాథ్‌నాయుడు, మురళియాదవ్, గోపి, రవికుమార్, ఫజల్, రమేష్, చంద్రరాజు, ఏపీటీఎఫ్ నాయకులు ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, టైలర్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

నూకతోటి రాజేష్‌కు సన్మానం

నాగలాపురం : సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్‌కు నాగలాపురం మండల నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు బుదవారం మండల అధ్యక్షుడు అపరంజిరాజు ఆధ్వర్యంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు, ప్రజాప్రతినిధులు కలిసి తిరుపతిలోని నూకతోటి రాజేష్ ఇంటికి చేరుకుని సత్కరించారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షుడు చిన్నదొరై, నాయకులు చిరంజీవి, హరిబాబు, శ్రీనివాసులు, అర్పుదం, పాల్గొన్నారు.

రక్తదాతకు అభినందన

శ్రీకాళహస్తి : పట్టణానికి చెందిన నారాయణ అనే వ్యక్తికి గుండె చికిత్స తిరుపతిలో జరిగింది. అయితే అతడికి బి నెగిటివ్ రక్తం కావాల్సి రావడంతో ఆయన కుటుంబ సభ్యులు బుధవారం యువతరం సేవా సమితి సభ్యులను సంప్రదించారు. స్పందించిన వారు బుచ్చినాయుడుకండ్రిగ మండలం కాటూరుకు చెందిన మురళికి ఫోన్ చేయగా వెంటనే అతడు తిరుపతికి వెళ్లి రక్తదానం ఇచ్చి నారాయణ శస్త్రచికిత్స సజావుగా సాగేందుకు సహకరించడంతో పలువురు అభినందించారు.

ఎంపీని కలిసిన మండల నేతలు


ఎంపీ గురుమూర్తిని సన్మానిస్తున్న కూనాటి రమణయ్య యాదవ్


మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి కేక్ తినిపిస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

రేణిగుంట(ఏర్పేడు) : ఎంపీ డాక్టర్ మద్దెల గురుమూర్తి, శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని ఏర్పేడు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు కలిసి పుష్పగుచ్ఛాలను అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు కూనాటి రమణయ్య యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఏర్పేడు మండల సర్పంచులు సంఘం అధ్యక్షుడు నల్లపాళెం శివయ్య, మాజీ ఎంపీపీ వెంకటరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, నాగార్జునరెడ్డి, బాలకృష్ణారెడ్డి, బాబు, రామయ్య ఆచ్చారి, గాలి గుణశేఖర్‌నాయుడు, జల్లిప్రసాద్, మంచు సురేఖ తదితరులు వారిని కలసి ఘనంగా సత్కరించారు.

మాజీ ఎమ్మెల్యేకు .....

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం పార్టీ కార్యాలయంలో అంజూరు తారక శ్రీనివాసులతో కలిసి కేక్ కట్ చేశారు. నాయకులు, కార్యకర్తల మధ్య నూతన సంవత్సర వేడుకలను జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. శ్రీకాళహస్తిలో ప్రజాసమస్యలపై నిరంతరం పోరాడుతామని తెలిపారు. కార్యక్రమంలో సతీమణి శ్రీవాణి రెడ్డి, నాయకులు వాసుదేవనాయుడు, నిర్మలమ్మ, కూనాటి రమణయ్యయాదవ్, సంధారాణి, మధుసూదన్‌రావు, షేక్ సిరాజ్‌బాషా, కోవి చంద్రయ్యనాయుడు, శెట్టిపల్లి సురేష్, సురేష్, హరినాయుడు, పఠాన్ ఫరీద్, తీగల చిన్న చందర్‌రాజు, యతిరాజులు, ఫజల్, సెన్నీరుకుప్పం శేఖర్, మదురెడ్డి, పత్తి మణి, గణేష్, చంద్ర, శివకుమార్‌యాదవ్, శ్రీనివాసులురెడ్డి, మున్నారాయల్ తదితరులు ఉన్నారు. కాగా ఏపీటీఎఫ్ నాయకులతో కలిసి క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మసక చీకట్లో మండలాభివృద్ధి కార్యాలయం



మండలంలో ఏ పల్లె అభివృద్ధి చెందాలన్నా.. ఏ పల్లెకు వీధి లైట్లతో వెలుగులు నింపాలన్న అందుకు నిధులు సమకూర్చాల్సింది మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయమే. అయితే అలాంటి కార్యాలయానికే వెలుగు లేక చిమ్మ చీకట్లో మగ్గుతోంది. ఆ భవనమే వరదయ్యపాళెం మండల పరిషత్ కార్యాలయం. ఊరి బయట ఉన్న ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో ఒక్క లైటు వెలిగించలేని దీనస్థితిలో ఉండడం గమనార్హం. ఎన్నో దస్త్రాలు, సంక్షేమ పథకాలకు సంబంధించిన రికార్డులు, ఇతర విలువైన సామగ్రి ఉన్న కార్యాలయాన్ని ఇంత నిర్లక్ష్యంగా ఉంచడం సరికాదని స్థానికులు చర్చించుకుంటున్నారు.

\- వరదయ్యపాళెం

కిక్కిరిసిన ఆలయాలు


శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ


కల్యాణ వేంకటేశ్వరస్వామి దర్శనానికి భక్తుల నిరీక్షణ

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : నూతన సంవత్సరం మొదటి రోజున ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. రేణిగుంట మండలంలోని ఆలయాల్లో నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం ఆలయాలను విశేషంగా అలంకరించారు. ప్రధానంగా గాజుల మండ్యం మూలస్థానేశ్వర స్వామి ఆలయం, రేణిగుంటలోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి, సాయిబాబా , గంగమ్మ ఆలయాల్లో విశేష పూలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. సాయిబాబా గుడిలో వేసిన బాబా ప్రతిమ భక్తులను ఆకట్టుకుంది. రేణిగుంటలోని క్రైస్తవులు చర్చిలు, ప్రార్థన మందిరాలకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

నారాయణవనం : మండలంలో వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వస్వామి, సారకాయలస్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. కైలాసనాథ కోనలో పర్యాటకుల సందడి నెలకొంది.


రేణిగుంట : బాబా గుడిలో ఆకట్టుకున్న సాయి ప్రతిమ


బుచ్చినాయుడుకండ్రిగ : చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు


అలంకరణలో రేణిగుంట గంగమ్మ తల్లి

అర్ధరాత్రి వరకు మద్యం దుకాణాలు

\- మందుబాబుల భరతం పట్టిన పోలీసులు


డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తిలో డిసెంబరు 31న యువత మద్యం తాగి రోడ్ల మీద తిరగకుండా కట్టడి చేశారు. ఎక్కడికక్కడ బృందాలను ఏర్పాటు చేసి డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి మంగళవారం రాత్రి జరిమానా విధించారు. ఓ వైపు అర్ధరాత్రి వరకు మద్యం దుకాణాలు తెరిచి మరోవైపు మద్యం తాగిన వారికి జరిమానాలు విధించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో 35 మంది, 2వ పట్టణ పరిధిలో ఏడుగురు, రూరల్‌లో ముగ్గురు, బుచ్చినాయుడుకండ్రిగలో ఇద్దరు మందుబాబులకు పోలీసులు జరిమానా విధించారు.

నేడు హెచ్‌ఎంలకు పునఃశ్చరణ తరగతులు

సత్యవేడు : మండలంలోని 67 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులకు పునఃశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ రవి తెలిపారు. గురువారం సత్యవేడు బాలుర ఉన్నత పాఠశాలలో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పునఃశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ తెలిపారు. పాఠశాల యాజన్యంపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ ద్వారా మెరుగైన సదుపాయాలు కల్పించాలని కోరారు.